క్లుప్తంగా

వైద్యశిబిరం



వర్ధన్నపేట : పట్టణంలోని మైనార్టీ గురుకుల విద్యాలయంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నేహా ఫాతిమా అధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, ఛాతీ కొలతల తోపాటు రక్తహీనత, బీపీ, వినికిడి, దృష్టి లోపాలు, తదితర పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతతోపాటు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు.

జోనల్ సెక్రటరీగా శ్రీనివాస్ ఎన్నిక



గీసుకొండ : వ్యాయామ ఉపాధ్యాయుల జోనల్ సెక్రటరీగా గీసుకొండ జెడ్పీ హైస్కూల్ పీఈటీ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్కూల్‌లో హెచ్‌ఎం సుభాష్ అధ్యక్షతన గీసుకొండ, సంగెం మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల జోనల్ స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. శ్రీనివాస్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాస్, కృష్ణ, రతన్‌సింగ్, సుధాకర్, ముఖర్జీ, కిషన్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి

పర్వతగిరి : మండల కేంద్రం నుంచి రోళ్లకల్ వెళ్లే బైపాస్ నుంచి వ్యవసాయ క్షేత్రాల దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక రైతులు వర్దినేని కేశవరావు, తదితరులు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు సమస్యను వివరించారు. దాదాపు 200 మీటర్ల మేర సీసీ రోడ్డు వేయాలని ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నర్సంపేట : నేడు (మంగళవారం) ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నెక్కొండ మండలంలోని అలంకానిపేట సబ్‌స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆ శాఖ చెన్నారావుపేట ఏఈ జోగానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక బిల్లులు, ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయికి చెందిన సీపీఎం నాయకుడు చిలువేరు నారాయణ కుమారుడు సాగర్ మంచిర్యాలలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం నివాళులర్పించారు. అనంతరం నారాయణను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కిరణ్ రెడ్డి, నర్సింగరావు, మండల కార్యదర్శి అమ్మ రోహిత్, ప్రచార కార్యదర్శి కూరతోట సురేశ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాస చేరాలు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలైన మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కక్కర్ల సంతోష్‌ను అతడి నివాసంలో కల్లు, గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పులి సోమయ్య, గౌరవ అధ్యక్షుడు తేరాల ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి పెద్దగోని సంపత్ సోమవారం పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చుల కోసం సంతోష్‌కు కొండాపురం సొసైటీ అధ్యక్షుడు తీరాల సదానందం రూ.3 వేలు సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ మండల అధ్యక్షుడు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యుడు బాలగోయిన రాంబాబు మాట్లాడారు. సంతోష్‌కు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, టాడీ కార్పొరేషన్ నుంచి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాకయ్య, నాయకులు రాజేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘టీ-డయాగ్నొస్టిక్స్’కు సిబ్బంది కొరత

- తాత్కాలిక సిబ్బంది, వైద్యులతో సేవలు
- ‘2డీ-ఎకో’, మైక్రో బయాలజీకి టెక్నీషియన్ల కరువు



పట్టణంలోని టీ-డయాగ్నొస్టిక్ సెంటర్ భవనం

నర్సంపేట రూరల్ : పేదలకు మెరుగైనా వైద్యసేవలు అందించే పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి టీ-డయాగ్నొస్టిక్ సెంటర్ (టీ-హబ్) భవనం నిర్మించి పరికరాలను సమకూర్చింది. సిబ్బందిని నియమించడంలో చిత్తశుద్ధి చూపకపోవడంతో పరికరాలు మూలన పడ్డాయి. 2డీ-ఎకో మిషనరీ ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు సిబ్బందిని నియమించలేదు. ల్యాబ్, ఎక్స్-రే, ఈసీజీ, యూఎస్‌జీ, మామో, టీఫా స్కానింగ్‌ల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సిబ్బంది అవసరం మేరకు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తాత్కాలిక సిబ్బందిని మెడికల్ కళాశాల నుంచి సమకూర్చి కాలం వెళ్లదీస్తున్న దుస్థితి నెలకొంది. పట్టణంలోని టీ హబ్ సెంటర్‌లో జిల్లాలోని 14 పీహెచ్‌సీలతోపాటు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి రక్తనమూనాలు వస్తాయి. వాటిని పరీక్షించి 24 గంటలలోపు రిపోర్టులను సంబంధిత రోగికి ఎస్‌ఎంఎస్ ద్వారా పంపుతారు. ఇందులో మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజిస్ట్, మేనేజర్ పోస్టులను ఇప్పటివరకు భర్తీ చేయలేదు. రేడియాలజిస్ట్‌గా నియమితులైన ఉద్యోగి బదిలీ అయ్యాడు. నాటి నుంచి ఆ పోస్టు కూడా ఖాళీగా ఉండడంతో స్థానిక మెడికల్ కళాశాల రేడియాలజీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌కు బాధ్యతలు అప్పగించి కాలం వెళ్లదీస్తున్నారు. ఖాళీల నేపథ్యంలో రిపోర్టులు అందడంలో ఆలస్యం అవుతోందన్న విమర్శలున్నాయి. 2 డీ ఎకో విభాగానికి కార్డియాలజీ టెక్నీషియన్‌ను నియమించలేదు. దీంతో మిషనరీ ఉన్నా సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది.

57 రకాల వైద్యపరీక్షలు

టీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో 57 రకాల వైద్యపరీక్షలు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం 134 రకాల పరీక్షలు చేసేలా ఉన్నతీకరిస్తామని ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. సిబ్బంది కొరత నేపథ్యంలో 24 గంటల్లో ఇవ్వాల్సిన రిపోర్టులు ఒక్కోసారి 48 నుంచి 72 గంటలు పడుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. దీంతో రోగికి సంబంధించిన వ్యాధి నిర్ధారణకు, వైద్యానికి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు.

మొత్తం పోస్టులు 10

టీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో 10 పోస్టులుండగా అందులో నాలుగు ఖాళీగా ఉన్నాయి. డీఈఓ (డాటా ఎంట్రీ ఆపరేటర్)ను డిప్యూటేషన్‌పై వర్ధన్నపేట ఆస్పత్రికి పంపించారు. ఆ పోస్టులోకి మెడికల్ కళాశాల డీఈఓలతో కాలం వెళ్లదీస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను మెడికల్ కళాశాల నుంచి రప్పించి తాత్కాలికంగా సేవలు అందిస్తున్నారు. మొత్తం ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

టీహబ్‌లో నెలవారీగా వివరాలు....

నెలలు	రక్త పరీక్షలు	మెమోగ్రాం	ఎక్స్‌రే	యూఎస్‌జీ	ఈసీజీ	టిఫా
జనవరి	11615	09	434	233	72	34
ఫిబ్రవరి	12235	03	392	196	56	32
మార్చి	13133	07	371	182	47	43
ఏప్రిల్	10560	02	307	282	04	24
మే	10255	05	382	386	–	37
జూన్	12623	04	308	423	–	40
జూలై	14139	08	491	402	–	53

తాత్కాలిక సిబ్బందితో సర్దుబాటు



నర్సంపేట హబ్‌లో సిబ్బంది కొరత వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలికంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి సిబ్బందిని, వైద్యులను కేటాయించి పరీక్షలు చేయిస్తున్నాం.

డాక్టర్ కిషన్, సూపరింటెండెంట్,
ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, నర్సంపేట

గ్రామాల వికాసమే ప్రభుత్వ ధ్యేయం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న అనిల్, నాయకులు

- బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్

రాయపర్తి : గ్రామాల వికాసమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ యాదవ్ తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధిపై మండల కేంద్రంలో ప్రజలకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించేలా కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని చెప్పారు. ప్రధాని మోదీ పాలనలో దేశం సాధించిన ప్రగతి, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించేలా బూత్ స్థాయి నుంచి పార్టీని సంసిద్ధం చేయడానికి శ్రేణులు సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్లకొండ రవి, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల అనిల్, మాజీ ప్రధాన కర్యాదర్శి బూరుగు నవీన్, యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేశ్, మండల ఉపాధ్యక్షుడు చిర్ర నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

వర్ధన్నపేట : రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరమండల్ కంపెనీ ప్రతినిధి, ఆగ్రోనమిస్ట్ డాక్టర్ హరి సూచించారు. పట్టణంలో ఏరువాక రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ హరి, కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మంజునాథ్ హాజరై మాట్లాడారు. డీఏపీ యూరియా, నానో యూరియా వాడాల్సిన పద్ధతులను వివరించారు. రాబోయే రోజుల్లో డీఏపీ, యూరియా ఉండవని చెప్పారు. నానో డీఏపీ, నానో యూరియా వాడకాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. మొక్కకు కొద్దికొద్దిగా వేయాలని, ఒక్కసారికే పెద్ద మొత్తంలో వేయకూడదని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై రైతులు చైతన్యవంతం కావాలని సూచించారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘం మేనేజింగ్ డైరెక్టర్ చొప్పరి సోమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆళ్ల చిన్న కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘రైతు బీమా’కు దరఖాస్తు చేసుకోండి

నర్సంపేట/సంగెం : అర్హులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నర్సంపేట, సంగెం మండలాల వ్యవసాయ అధికారులు గోపాల్, సాగరిక సోమవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు రేపటితో గడువు ముగియనుందని పేర్కొన్నారు. గత జూన్ 5వ తేదీ నాటికి పట్టాదారు పాసు పుస్తకం పొంది 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య జన్మించిన రైతులు మాత్రమే అర్హులని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఇతర జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- మండల ఏఓ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఏఓ విజయ్‌కుమార్

వర్ధన్నపేట : సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కడారిగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పంటల సాగులో వస్తున్న నూతన ఒరవడులను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. స్వల్ప పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే దిశగా అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని చెప్పారు. పంటల సాగుతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని తెలిపారు. అధునిక పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు.

‘రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం’

పర్వతగిరి : ఏఐసీసీ నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల చోరీ, దొంగ ఓట్లతో బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకున్న విషయాన్ని రాహుల్ గాంధీ ఇటీవల బట్టబయలు చేసి ఎన్నికల సంఘాన్ని అవకతవకలపై నిలదీశారని, ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి ర్యాలీ చేపట్టగా రాహుల్ గాంధీని, ప్రతిపక్ష ఎంపీలను అరెస్టు చేశారని తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ బీజేపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

- ఎంసీపీఐ(యూ) కార్యదర్శి రాజా సాహెబ్



నిరసనా ర్యాలీ నిర్వహిస్తున్న నాయికులు

దుగ్గొండి : బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ఆమోదించాలని ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రేబల్లెలో సోమవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా సాహెబ్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మాణం చేసి పంపితే కేంద్రం నాన్చివేత ధోరణి అవలంభిస్తోందని విమర్శించారు. గవర్నర్‌ను బిల్లు ఆమోదించకుండా ప్రభావితం చేస్తున్న బీజేపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పార్లమెంటులో ఆమోదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుసుంబ బాబురావు, మహ్మద్ హుస్సేన్, గీసపాక కొమురయ్య, పేరబోయిన చేరాలు, ఐలోని, మేరుగు సుధాకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాల వాల్‌పోస్టర్లను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఓసీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రూ.3200 ఉండగా గిరిజనులకు కేవలం రూ.500లకే ప్రవేశం కల్పించేలా వర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గంట చక్రపాణి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సర ప్రవేశానికి రెగ్యూలర్/ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7382929577లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు నరేశ్, శివ, కౌన్సిలర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : దుగ్గొండి మండలంలోని రేఖంపల్లికి చెందిన సుమారు 20 మంది బీఆర్‌ఎస్ నాయకుల కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో సోమవారం చేరాయి. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాసంక్షేమానికి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు.

నర్సంపేట : మాత్ర వేస్తున్న వైద్యాధికారి సరోజ



నర్సంపేట రూరల్ : జెడ్పీ హైస్కూల్‌లో..



ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నర్సంపేట, చెన్నారావుపేట, వర్ధన్నపేట, ఖానాపురం, సంగెం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అరుణ్ చంద్ర, సరోజ, నేహా ఫాతిమా, సురేశ్‌కుమార్, జ్యోతి, వంశీకృష్ణ, తహసీల్దార్ రమేశ్ మాట్లాడారు. మూడు నుంచి 19 ఏళ్లలోపు వయస్సున్న బాలలందరికీ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగుల నివారణ సాధ్యమని చెప్పారు. తద్వారా జీర్ణాశయంలోని ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. నులి పురుగుల నివారణను సామాజిక బాధ్యతగా భావించాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



వర్ధన్నపేట : మాత్ర వేస్తున్న హెచ్‌ఎం



సంగెం : మాత్ర వేస్తున్న ఎంఈఓ రాము



ఖానాపురం : విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న తహసీల్దార్ రమేశ్, తదితరులు

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

నెక్కొండ : తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమకారిణి చాకలి (చిట్యాల) ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అభివర్ణించారు. మండల కేంద్రంలోని హైస్కూల్ సెంటర్‌లో రజక సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పనులను సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. చాకలి ఐలమ్మను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తొలి దశ తెలంగాణ ఉద్యమకారిణిగా ఐలమ్మ పోరాడిన తీరును వివరించారు. ఐలమ్మ పోరాట చరిత్రను సమాజంలోని ప్రతిఒక్కరూ అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విగ్రహ దాత, ప్రియదర్శిని యూత్ క్లబ్ కన్వీనర్ చల్లా రఘోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ మేజర్ పంచాయతీ ఈఓ సదానందం, రజక సంఘం నాయకులు రామారపు వీరస్వామి, రామారపు లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- ‘సఖి’ కేస్ వర్కర్ తిరుమల



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల

నల్లబెల్లి : మహిళల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని సఖి కేంద్రం కేస్ వర్కర్ తిరుమల తెలిపారు. మండలంలోని రుద్రగూడెంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘం సభ్యులకు, హైస్కూల్ విద్యార్థులకు సఖి కేంద్రంలో లభిస్తున్న సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల భద్రత కోసం ప్రభుత్వాలు సఖి కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నాయని చెప్పారు. అవసరమైన వారికి తాత్కాలిక వసతి కూడా లభిస్తుందని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు, వృద్ధులు రక్షణ కోసం హెల్ప్‌లైన్ నంబర్ 181, 1098, 14567లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. అనంతరం సఖి సేవలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హ్యూమన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, వీఓఏ వనిత, తదితరులు పాల్గొన్నారు.

19న పెన్షనర్ల సన్నాహక సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

- ఎంఎస్‌పీ ఏపీ అధ్యక్షుడు విశ్వనాథ్

వర్ధన్నపేట : పెన్షనర్ల మహాగర్జన విజయవంతం కోసం ఈనెల 19న వర్ధన్నపేటలో పెన్షనర్ల సన్నాహక సదస్సు నిర్వహిస్తామని ఎంఎస్‌పీ ఏపీ అధ్యక్షుడు విశ్వనాథ్ కోరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, బీడీ, ఇతర రంగాల కార్మికుల పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కి 20 నెలలు గడచినా పట్టించుకోవడం లేదన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కార దిశగా ఉద్యమాలు తప్పవని చెప్పారు. సదస్సుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెన్షనర్లు తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కందుకూరి సోమన్న, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, నాయకులు గోలి సుధాకర్, ఐత రాజు, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.